TGTEL/26/A4015

తెలంగాణ మంజీరా

సామాన్యుని చేతిలో అక్షర అస్త్రం తెలంగాణ మంజీరా

హైదరాబాద్ 02 ఎడిటర్ : సత్యనారాయణ 22 గురువారం అక్టోబర్ 2026 పేజీలు 4 సంపుటి:01 సంచిక : 162 తెలుగువారి పత్రిక..... మీ కోసం

రిపోర్టర్లు కావలెను
తెలంగాణ మంజీరా
తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.
తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న
తెలంగాణ మంజీరా
మీకు సరైన వేదిక... అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పిస్తోంది.
98496 38320

మా దేశంలో అస్థిరతకు భారత్ కుట్ర

అజిత్ దోభాల్‌పై పాకిస్థాన్ ఆరోపణలు

2 లో

తొలి రోజే జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు భారీ స్పందన..

2.5 రెట్లు సబ్‌స్క్రిప్షన్

- మొత్తం ఇష్యూ విలువ రూ.30,213 కోట్లు
- క్యూఐబీ విభాగానికి 7.46 రెట్ల స్పందన
- సంస్థాగతేతర పెట్టుబడిదారుల విభాగం 1.32 రెట్లు సబ్‌స్క్రైబ్
- రిటైల్ విభాగం 60 శాతమే సబ్‌స్క్రైబ్
- అక్టోబర్ 23తో ముగియనున్న ఐపీఓ; 28న లిస్టింగ్ అవకాశం

జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు తొలిరోజే భారీ స్పందన లభించింది. రూ.30,213 కోట్ల విలువైన ఈ పబ్లిక్ ఇష్యూకు బుధవారం మధ్యాహ్నం 3.15 గంటల సమయానికి 2.5 రెట్ల బిడ్లు వచ్చాయి. దేశంలోనే అతిపెద్ద పబ్లిక్ ఆఫరింగ్‌గా నిలిచిన ఈ ఐపీఓ అక్టోబర్ 23 వరకు అందుబాటులో ఉంటుంది.బీఎస్ఈ గణాంకాల ప్రకారం.. ఆఫర్‌లో 19.75 కోట్ల షేర్లు ఉండగా, 49.56 కోట్ల షేర్ల కోసం బిడ్లు దాఖలయ్యాయి. సంస్థాగత పెట్టుబడిదారుల నుంచి అత్యధిక స్పందన వచ్చింది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ) విభాగం 7.46 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది.

మిగతా 2 లో



జగన్ ఒక క్రిమినల్ లిటిగెంట్ చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు

-పిటిషన్లతో ఎన్నికలు, అభివృద్ధిని వైసీపీ అడ్డుకుంటోందని ఆరోపణ

-జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకోవాలని నేతలకు సూచన

-క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ శ్రేణులకు కీలక దిశానిర్దేశం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అభ్యర్థులు, బూత్ స్థాయి కార్యకర్తలతో బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాజకీయాల్లో జగన్ లాంటి 'క్రిమినల్ లిటిగెంట్లు' ఉండటం అత్యంత ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.

నేనేమీ ట్రావెల్ ఏజెంట్‌ను కాదు:

రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్య

-ఆందోళనల వేళ రాహుల్ విదేశాలకు వెళ్లారంటూ బీజేపీ తీవ్ర విమర్శలు

-రాహుల్ పర్యటనను సమర్థించిన మరో కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్

-సీఈసీకి వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల మధ్య ఈ పరిణామం

లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై వస్తున్న వార్తలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ ఆసక్తికరంగా స్పందించారు. రాహుల్ పర్యటన గురించి మీడియా ప్రశ్నించగా, "నేనేమీ ట్రావెల్ ఏజెంట్‌ను కాదు" అంటూ ఆయన వ్యాఖ్యానించడం గమనార్హం .బుధవారం తిరువనంత పురంలో శశిథరూర్ విలేకరులతో మాట్లాడుతూ "నేను ట్రావెల్ ఏజెంట్‌ను కాదు.

మిగతా 2 లో

ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం

గ్రాప్-1 ఆంక్షలు అమలు

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీతోపాటు నేషనల్ క్యాపిటల్ రీజియన్ (ఎన్‌సీఆర్) పరిధిలో గ్రాప్ 1 (గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్) ఆంక్షల్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఇప్పటికీ ఢిల్లీలో వాయు కాలుష్య నాణ్యత పూర్ కేటగిరిలో ఉంది. బుధవారం ఉదయం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 223గా నమోదైంది.వాయు కాలుష్యం పెరగడం, ప్రజలు శ్వాస సంబంధిత ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రాప్ 1 ఆంక్షల్ని అమలు చేయాలని ఢిల్లీ పర్యావరణ శాఖ మంత్రి మంజిందర్ సింగ్ సిర్సా అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. దీని ప్రకారం ప్రజలు వాయు కాలుష్యానికి కారణమయ్యే కొన్ని చర్యల్ని ఆపేయాల్సి ఉంటుంది. గ్రాప్ 1 ప్రకారం.. ఢిల్లీలోని రెస్టారెంట్లు, హోటళ్లు, ఇతర చోట్లా ఎక్కడా వంట కోసం బొగ్గును వాడకూడదు. డీజిల్ జనరేటర్లను కూడా అత్యవసర పరిస్థితుల్లో తప్ప వాడరాదు.మరోవైపు ఢిల్లీలో ఉష్ణోగ్రతలు కూడా పడిపోతున్నాయి. ఇది సగటు కంటే తక్కువ. సీపీసీబీ డాటా ప్రకారం.. ఏక్యూఐ 0 నుంచి 50 వరకు ఉండొచ్చు. దీన్ని గుడ్ కేటగిరిగా చెబుతారు.

మిగతా 2 లో

అమెరికా-పాక్ దోస్తీ..

భారత్‌కు అగ్రరాజ్యం కీలక హామీ!

- భారత్‌తో బంధానికి నష్టం జరగదని అమెరికా విదేశాంగ మంత్రి రూబియో హామీ
- వాణిజ్య ఒప్పందానికి అమెరికా కట్టుబడి ఉందని స్పష్టీకరణ
- పాక్‌తో సంబంధాలు ఘర్షణల నివారణకు ఉపయోగపడతాయని వెల్లడి
- భారత్‌ను ఆందోళనపరిచే చర్యలను పాక్ నిరుత్సాహపరిచేలా చూస్తామన్న రూబియో
- భారత్‌తో సంబంధాలకు తమ ప్రాధాన్యం తగ్గదని స్పష్టీకరణ

అమెరికా, పాకిస్థాన్ మధ్య సాన్నిహిత్యం పెరుగుతున్న వేళ భారత్‌కు అగ్రరాజ్యం భరోసా ఇచ్చింది. ఇతర దేశాలతో తమ సంబంధాల వల్ల భారత్‌తో బంధానికి ఎలాంటి నష్టం జరగదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో స్పష్టం చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందం, పరస్పర సహకారానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో రూబియో ఈ వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2 లో

పోలీసు అమరులు చేసిన త్యాగాలు

మరువలేనివి

అమరుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వం, పోలీసు శాఖ, సమాజం అండగా వుంటాయి

సీఎం రేవంత్ రెడ్డి

పోలీసు అమరవీరుల సంస్మరణ దినమైన అక్టోబర్ 21 ఎంతో భావోద్వేగమైన రోజని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ప్రజల భద్రత, సమాజ రక్షణ కోసం పోలీసు అమరులు చేసిన త్యాగాలు మరువలేనివని, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవడంతో పాటు, పోలీసుల సంక్షేమం, వారి పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. అమరుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా పెంపుతో పాటు, అర్హులకు ప్రభుత్వ ఉద్యోగం, ఉచిత విద్య, వైద్య సహాయం అందిస్తున్నామని, పోలీసుల పిల్లల కోసం ప్రత్యేకంగా యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించామని వివరించారు.మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలి. బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదు. మహిళల భద్రత కేవలం పోలీసు శాఖ బాధ్యత కాదు.. సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలి . పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారిని మీ కుటుంబ సభ్యుల్లాగా చూడండి. అలా అయితేనే మీరు బాధ్యతగా వ్యవహరిస్తారు. నూటికి నూరు శాతం సమస్యకు పరిష్కారం చూపిస్తారని అన్నారు.సైబర్ నేరాలు, ఆన్ లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, ఆహారం కల్తీ వంటి మారుతున్న నేర స్వభావాలు, సవాళ్లను ఎదుర్కోవడంలో పోలీసు శాఖను బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలీసు అమరుల త్యాగాలను గౌరవిస్తూ, వారి ఆశయాలను కొనసాగిస్తూ శాంతియుతమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు.నిర్మించుకుందామని పిలుపునిచ్చారు.పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా హైదరాబాద్ గోషామహల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ, శాంతి భద్రతల ప్రాధాన్యత, పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు.అమరుల కుటుంబ సభ్యులకు ఒక మాట చెబుతున్నాను. మీరు కోల్పోయిన వ్యక్తిని ఎవరూ తిరిగి తీసుకురాలేరు. కానీ మీ బాధలో మీరు ఒంటరివారు కాదు. తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ, సమాజం మీకు అండగా ఉంటాయని అన్నారు.

ఈ ఏడాది అమరులైన పోలీసు కుటుంబాల సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందించారు.

మా దేశంలో అస్థిరతకు భారత్ కుట్ర

అజిత్ దోభాల్‌పై పాకిస్థాన్ ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

-ఉగ్రవాదాన్ని భారత్ ఒక విధానంగా ఉపయోగిస్తోందని పాకిస్థాన్ నిరాధారణ ఆరోపణలు

-పాకిస్థాన్‌లో అస్థిరత సృష్టించేందుకు 'అజిత్ డోభాల్ డాక్ట్రిన్' అమలు చేస్తోందని విమర్శ

-భారత్ 'నో ఫస్ట్ యూజ్' అణు విధానం ఒక దౌత్యపరమైన ఎత్తుగడ అని వ్యాఖ్య

-లండన్‌లోని అంతర్జాతీయ వేదికపై పాక్ న్యూక్లియర్ అడ్వైజర్ మజర్ జమిల్ ప్రసంగం

భారత్ తమ దేశంలో అస్థిరతను సృష్టించేందుకు ఉగ్రవాదాన్ని ఒక విధానంగా ఉపయోగిస్తోందని పాకిస్థాన్ తీవ్ర ఆరోపణలు చేసింది. లండన్‌లోని ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్ట్రాటజిక్ స్టడీస్ (ఐఐఎస్ఎస్)లో జరిగిన ఓ కార్యక్రమంలో పాకిస్థాన్ నేషనల్ కమాండ్ అథారిటీ సలహాదారు, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ మజర్ జమిల్ ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. అక్టోబర్ 13న ఆయన చేసిన ప్రసంగానికి సంబంధించిన పూర్తి వివరాలు, రికార్డింగ్ తాజాగా బయటకు రావడంతో ఈ అంశం మరోసారి చర్చనీయాంశమైంది."దక్షిణాసియాలో అణు నిరోధకత, వ్యూహాత్మక స్థిరత్వం" అనే అంశంపై ప్రసంగించిన మజర్ జమిల్.. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్‌ను ప్రస్తావిస్తూ "డోభాల్ డాక్ట్రిన్"ను అమలు చేస్తూ పాకిస్థాన్‌ను బలహీనపరిచేందుకు భారత్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ), బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) వంటి ఉగ్రవాద సంస్థలకు భారత్ మద్దతిస్తోందని ఆయన ఆరోపణలు చేశారు. 1971 బంగ్లాదేశ్ యుద్ధ సమయంలో ముక్తి వాహినికి, 1980లలో ఎల్టీటీఈకి భారత్ మద్దతు ఇచ్చిందని, అలాగే 2001-2014 మధ్య ఆఫ్ఘనిస్థాన్-పాకిస్థాన్ సరిహద్దులో అనేక కాన్సులేట్లను నడిపిందని ఆయన చారిత్రక ఉదాహరణలను ప్రస్తావించారు. భారత్ అణు విధానాన్ని కూడా జమిల్ తీవ్రంగా విమర్శించారు. భారత్ ప్రకటించిన 'నో ఫస్ట్ యూజ్' (మొదటగా అణ్వస్త్రాలను ప్రయోగించం) విధానం కేవలం ఒక దౌత్యపరమైన బూటకమని కొట్టిపారేశారు. గతేడాది 'ఆపరేషన్ సిందూర్' సమయంలో భారత్.. అణు, సంప్రదాయ వార్‌హెడ్‌లను మోసుకెళ్లగల బ్రహ్మోస్ క్షిపణులను ఉపయోగించిందని ఆరోపించారు. అయితే, బ్రహ్మోస్ కేవలం సంప్రదాయ వార్‌హెడ్‌లను మాత్రమే మోసుకెళ్లగలదని, అది వ్యూహాత్మక బలగాల పరిధిలోకి రాదని భారత వర్గాలు గతంలోనే స్పష్టం చేశాయి. భారత్‌కు న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్ (ఎన్ఎస్‌జీ) మినహాయింపును అంతర్జాతీయ సమాజం సమీక్షించాలని జమిల్ డిమాండ్ చేశారు. పురాణాలను జాతీయ శక్తితో ముడిపెట్టే ప్రమాదకరమైన భావజాలం భారత సైనిక ఆలోచనా విధానంలో ఉందని, ఇది ఈ ప్రాంత భద్రతకు పెను ముప్పుగా పరిణమించిందని ఆయన వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య కొంతకాలంగా ఉగ్రవాదం, అణు విధానాలపై ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆఫ్ఘన్ గడ్డపై నుంచి తమపై దాడులు చేస్తున్న ఉగ్రవాదులకు భారత్ మద్దతిస్తోందని పాక్ ఆరోపిస్తుండగా.. తమ దేశంలో దాడులకు పాల్పడుతున్న ఉగ్రవాదులకు పాకిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని భారత్ బలంగా వాదిస్తోంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ వ్యూహాత్మక ప్రణాళికల విభాగానికి మా

తొలి రోజే జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీఓకు భారీ స్పందన.. 2.5 రెట్లు సబ్‌స్క్రిప్షన్

మొదటిపేజీ తరువాయి

సంస్థాగతేతర పెట్టుబడిదారుల విభాగానికి 1.32 రెట్ల బిడ్లు వచ్చాయి. రిటైల్ పెట్టుబడిదారుల విభాగం మాత్రం 60 శాతమే సబ్‌స్క్రైబ్ అయింది.రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాదారుల కోసం కేటాయించిన విభాగం 1.16 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ విభాగంలో అందుబాటులో ఉన్న 2.23 కోట్ల షేర్లకు గానూ 2.59 కోట్ల షేర్ల కోసం బిడ్లు వచ్చాయి. ఉద్యోగుల కోసం కేటాయించిన విభాగం కూడా పూర్తిగా సబ్‌స్క్రైబ్ అయింది.ఐపీఓకు ముందు జియో ప్లాట్‌ఫామ్స్ 212 మంది యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.8,109.84 కోట్లు సమీకరించింది. సింగపూర్‌కు చెందిన జీఐసీ, నార్జెస్ బ్యాంక్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్, అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ సహా పలు అంతర్జాతీయ పెట్టుబడి సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, హెచ్‌డీఎఫ్‌సీ, నిప్పాన్ ఇండియా వంటి దేశీయ సంస్థలూ పెట్టుబడులు పెట్టాయి. ఒక్కో షేరు ధరను రూ.1,065 నుంచి రూ.1,119 మధ్య నిర్ణయించారు. ఈ ఆఫర్‌లో గరిష్ఠంగా 27 కోట్ల కొత్త షేర్లను జారీ చేయనున్నారు. అక్టోబర్ 26 నాటికి షేర్ల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. అక్టోబర్ 28న బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్టయ్యే అవకాశం ఉంది.

అమెరికా-పాక్ దోస్తీ.. భారత్‌కు అగ్రరాజ్యం కీలక హామీ!

మొదటిపేజీ తరువాయి

పాకిస్థాన్‌తో సంబంధాలు అవసరమేనని రూబియో అన్నారు. ఆ దేశంతో తమకున్న సంబంధాలను సానుకూలంగా ఉపయోగించుకోవచ్చని చెప్పారు. భారత్‌ను ఆందోళనకు గురిచేసే చర్యలను పాకిస్థాన్ నిరుత్సాహపరిచేలా తమ ప్రభావాన్ని ఉపయోగిస్తామని తెలిపారు. తద్వారా ప్రాంతీయ ఘర్షణలు తలెత్తకుండా చూడవచ్చని అభిప్రాయపడ్డారు.భారత్‌తో వాణిజ్య ఒప్పందం కోసం చేస్తున్న ప్రయత్నాలు, ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న చర్చలు తమ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.ప్రస్తుత పరిస్థితులను 1970ల నాటి అమెరికా విదేశాంగ విధానంతో పోల్చడం సరికాదని రూబియో అన్నారు. అప్పట్లో ప్రచ్ఛన్న యుద్ధం సహా అనేక పరిణామాలు ఉన్నాయని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రపంచ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని చెప్పారు. అప్పట్లో అమెరికా అధ్యక్షుడు రిచర్డ్ నిక్సన్ హయాంలో పాకిస్థాన్ సైనిక పాలకులకు వాషింగ్టన్ మద్దతుగా నిలిచింది.రెండు రోజుల భారత పర్యటనలో ఉన్న రూబియో రష్యా-ఉక్రెయిన్ యుద్ధంపైనా స్పందించారు. నాలుగేళ్లుగా కొనసాగుతున్న ఈ యుద్ధానికి పరిష్కారం కనుగొనడం అంత సులువు కాదని అన్నారు. సమస్యను పరిష్కరించడం తేలికై ఉంటే ఇప్పటికే యుద్ధం ముగిసిపోయేదని వ్యాఖ్యానించారు.

జగన్ ఒక క్రిమినల్ లిటిగెంట్: చంద్రబాబు తీవ్ర వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి

తానే విధ్వంసానికి పాల్పడి, తానే కోర్టుకు వెళ్లే వికృత ఆలోచనలు జగన్‌కే వస్తాయని చంద్రబాబు అన్నారు. వైసీపీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణిస్తూ, అభివృద్ధిని, ఎన్నికలను అడ్డుకోవడమే ఆ పార్టీ పనిగా పెట్టుకుందని విమర్శించారు. కేవలం స్థానిక ఎన్నికలనే కాకుండా, మెగా డీఎస్సీ, అమరావతి, పోలవరం వంటి కీలక ప్రాజెక్టులను అడ్డుకునేందుకు వైసీపీ నేతలు వందల సంఖ్యలో పిటిషన్లు వేశారని ఆరోపించారు. ఓటరు జాబితా, బీసీ రిజర్వేషన్లపైనా కోర్టులకు వెళ్లి ఎన్నికల ప్రక్రియను అడ్డుకున్నారని గుర్తుచేశారు.స్థానిక ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో సమన్వయం చేసుకుంటూ కూటమి అభ్యర్థుల గెలుపే ధ్యేయంగా పనిచేయాలని చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తాము మంచి అభ్యర్థులను ఎంపిక చేస్తుంటే, వైసీపీ మాత్రం విధ్వంసకారులను బరిలోకి దించుతోందని ఆరోపించారు. బెంగళూరులో కూర్చొని జగన్ విధ్వంస రచనలు చేస్తున్నారని, ఇతర రాష్ట్రాల నుంచి గుండాలను దించేందుకు కుట్రలు పన్నుతున్నారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.ఎన్నికల ప్రచారానికి వారం రోజులే సమయం ఉందని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రజలతో మమేకం కావాలని సూచించారు. ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరిస్తూనే, వైసీపీ అరాచకాలను, ప్రజాస్వామ్య వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని కోరారు. వికృత మనస్తత్వం ఉన్నవారిని రాజకీయాలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు వ్యాఖ్యానించారు.

బాపట్లలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్లు ప్రారంభం

బాపట్ల : అక్టోబర్ 21 (తెలంగాణ మంజీరా)

బాపట్ల జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. నామినేషన్ల స్వీకరణకు అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా బాపట్ల మండల పరిషత్ కార్యాలయంలో దరివాదకొత్తపాలెంకు చెందిన మరుప్రోలు తిరుపతిరెడ్డి వైఎస్సార్సీపీ తరపున తొలి నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.

నేనేమీ ట్రావెల్ ఏజెంట్‌ను కాదు: రాహుల్ గాంధీ విదేశీ పర్యటనపై శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్య

మొదటిపేజీ తరువాయి

కాబట్టి, నేను ఆ విషయంపై వ్యాఖ్యానించలేను" అని స్పష్టం చేశారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్)కు వ్యతిరేకంగా ఢిల్లీలో విపక్షాలు ఆందోళనలు చేస్తున్న సమయంలో రాహుల్ గాంధీ విదేశాలకు వెళ్లడంపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. రాహుల్ వియత్నాం వెళ్తున్న విమానంలో ఉన్నారంటూ ఒక వీడియోను బీజేపీ 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది. నిరసనలతో బాగా అలసిపోయినందువల్లే ఆయనకు విశ్రాంతి అవసరమైందని బీజేపీ నేత షానవాజ్ హుస్సేన్ ఎద్దేవా చేశారు.అయితే, రాహుల్ గాంధీ పర్యటనను కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ సమర్థించారు. ప్రధాని సహా ఇతర నేతలు విదేశాలకు వెళ్లడం లేదా అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారని నిలదీశారు. విదేశాల్లో రాహుల్ విద్యార్థులతో, మేధావులతో సమావేశమవుతారని, ఇంటర్వ్యూలు ఇస్తారని ఆయన గుర్తుచేశారు.

దసరా వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే..

దేవరకద్ర అక్టోబర్ 21 తెలంగాణ మంజీరా

దేవరకద్ర నియోజకవర్గం లో భూత్పూర్ మండల పరిధిలోని అన్నసాగర్ గ్రామంలో మంగళవారం స్థానిక ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో స్థానిక మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, దసరా వేడుకలో పాల్గొని అక్కడ ఉన్న జమ్మి వృక్షానికి ప్రత్యేకంగా పూజలు చేశారు. నియోజకవర్గ ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆల కుటుంబ సభ్యులు అందరూ కూడా పాల్గొన్నారు.

ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం.. గ్రాప్-1 ఆంక్షలు అమలు

మొదటిపేజీ తరువాయి

ఆ తర్వాత 51-100 వరకు ఉంటే శాటిస్ఫ్యాక్టరీగా, 101-200 ఉంటే మోడరేట్, 201-300 ఉంటే పూర్, 301-400 ఉంటే వెరీ పూర్, 401-500 ఉంటే సీవియర్ (అత్యంత ప్రమాదకరస్థాయి)గా పరిగణిస్తారు. ప్రస్తుతం ఢిల్లీ పరిధిలో పూర్ కేటగిరిలో వాయు కాలుష్యం ఉంది. ఇలాంటప్పుడు గ్రాప్-1 ఆంక్షల్ని అమలు చేస్తారు.దీనివల్ల గాలిలోకి దుమ్ము, ధూళి, కాలుష్యం తక్కువగా వెలువడుతుంది. రోడ్డుపై వాహనాలు వెలువడుతున్నప్పుడు డస్ట్ రాదు. వివిధ నిర్మాణాలు, కూల్చివేతల సందర్భంగా కూడా దుమ్ము, ధూళి వెలువడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ విషయంలో అధికారులు తనిఖీలు చేపడుతారు. చెత్త, ఆకులు, ఇతర వ్యర్థాల్ని బహిరంగంగా కాల్చకూడదు. కలప, బొగ్గు కాల్చకూడదు. డీజిల్ జనరేటర్లు ఎమర్జెన్సీలో మాత్రమే వాడాలి. అత్యంత వాయు కాలుష్యం వెదజల్లే వాహనాల్ని కూడా నిషేధిస్తారు. పరిశ్రమల నుంచి కూడా కాలుష్యం వెలువడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

నందిగామ నాలుగో వార్డులో పరిటాల నరేంద్ర బాబుకు విజయావకాశాలపై చర్చ..

భారీ మెజారిటీతో గెలుస్తారంటూ ఊహాగానాలు

నందిగామ.అక్టోబర్ 21 (తెలంగాణ మంజీరా)

ఎన్టీఆర్ జిల్లా నందిగామ మున్సిపాలిటీలోని నాలుగో వార్డులో ఎన్నికల వేడి రోజురోజుకూ పెరుగుతోంది. ఈ వార్డు నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పరిటాల నరేంద్ర బాబు బరిలో నిలవడంతో స్థానిక రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఆయనకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించే అవకాశాలు ఉన్నాయంటూ స్థానికంగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి.నాలుగో వార్డులో ఎన్నికల ప్రచారం, అభ్యర్థుల బలాబలాలు, ఓటర్ల మద్దతుపై రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. పరిటాల నరేంద్ర బాబు గెలుపుపై అనుచరులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. వార్డులోని ఓటర్లను ఆకట్టుకునేందుకు అభ్యర్థులు తమదైన శైలిలో

ప్రయత్నాలు సాగిస్తున్నారు.మరోవైపు, నాలుగో వార్డులో ఓటర్ల నిర్ణయం ఎలా ఉండబోతోంది, ఎవరి వైపు మొగ్గు చూపుతారనే అంశం ఆసక్తికరంగా మారింది. భారీ మెజారిటీతో విజయం సాధిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి ఎన్నికల ఫలితాల తర్వాతే స్పష్టమవుతుంది. చివరకు ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే.

బాపట్ల నియోజకవర్గంలో తొలి రోజు 20 ఎంపీటీసీ నామినేషన్లు దాఖలు

బాపట్ల : అక్టోబర్ 21 (తెలంగాణ మంజీరా)

బాపట్ల మండలంలో మొత్తం 15 ఎంపీటీసీ స్థానాలకు గాను ఈ రోజు 16 మంది అభ్యర్థులు నామినేషన్ వేయటం జరిగింది. టీడీపీ తరపున 5 గురు అభ్యర్థులు వైసీపీ తరపున 11 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయటం జరిగింది.కర్లపాలెం మండలంలో మొత్తం 14 ఎంపీటీసీ స్థానాలకు ఎవరు నామినేషన్లు దాఖలు పరచలేదు పిట్టలవానిపాలెం మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలకు ఈరోజు మొత్తం 4 మానినేషన్ లు దాఖలు కాగా వైసీపీ 2 బిజెపి 1 స్వతంత్ర అభ్యర్థి 1 అభ్యర్థులు నామినేషన్ దాఖలు పరచటం జరిగింది.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

సంస్మరణ దినోత్సవంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్

విధి నిర్వహణలో అసువులు బాసిన అమరులకు ఘన నివాళులు

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

శాంతి భద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తూ అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, సమాజం ఎల్లవేళలా వారికి రుణపడి ఉంటుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. విధి నిర్వహణలో భాగంగా సంఘవిద్రోహ శక్తులతో పోరాడుతూ అమరులైన పోలీసులను స్మరించుకోవడం, వారి కుటుంబాల త్యాగాలను గుర్తించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని గుర్తు చేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ లో జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ తో కలిసి పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ విధుల్లో పోలీసులు అనునిత్యం నిమగ్నమై ఉంటారని, ఈ క్రమంలో ఎదురయ్యే అనేక సవాళ్లను తమ ప్రాణాలను పణంగా పెట్టి ధైర్యంగా ఎదుర్కొంటారని అన్నారు. నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన పోలీసు అమరవీరులు జంగయ్య (సిర్గాపూర్ పోలీస్ స్టేషన్), ఎల్లయ్య (సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్), సత్యనారాయణ (జిన్నారం పోలీస్ స్టేషన్), సురేష్ (కంగ్టి పోలీస్ స్టేషన్) ప్రజల రక్షణ కోసం చేసిన వారి ధైర్య సాహసాలను, సేవలను కొనియాడారు. పోలీస్ అమరుల కుటుంబాలకు ప్రభుత్వం జిల్లా యంత్రాంగం ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ మాట్లాడుతూ, 1959 అక్టోబర్ 21న లడఖ్‌లోని హాట్ స్ప్రింగ్స్ వద్ద విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పది మంది పోలీసు సిబ్బంది త్యాగాలకు గుర్తుగా ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న దేశవ్యాప్తంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దేశ భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల రక్షణ కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు. తెలంగాణ ప్రాంతంలో గతంలో నక్సలిజం ప్రభావం తీవ్రంగా ఉన్న సమయంలో ఎంతోమంది పోలీసులు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. సంగారెడ్డి జిల్లాకు చెందిన జంగయ్య, ఎల్లయ్య, సత్యనారాయణ, సురేష్ ప్రజల రక్షణ కోసం చేసిన ప్రాణత్యాగాలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. అమరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో విధినిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబీకులకు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి చైతన్య రెడ్డి, డీఎస్పీలు, సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కు దసరా శుభాకాంక్షలు

మండల కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తల అభినందనలు

రాయికోడ్, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్యను మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు బుధవారం నాడు మండలంలోని నాగ్వార్ గ్రామంలో మర్యాదపూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ దసరా పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అభివృద్ధి తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు నాయకులు, పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొని గోల్ల అంజయ్యకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్‌కు దసరా శుభాకాంక్షలు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సువర్ణ మల్లన్న పాటిల్

జహీరాబాద్, తెలంగాణ మంజీరా న్యూస్ :

విజయ దశమి (దసరా) పండుగను పురస్కరించుకొని ఎంపి. సురేష్ కుమార్ షేట్కార్ ను కలిసి కోహీర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సువర్ణ మల్లన్న పాటిల్ దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి దసరా పండుగ శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ దసరా శుభాకాంక్షలు తెలుపుతూ, పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సమృద్ధిని తీసుకురావాలని ఆకాంక్షించారు.

పండుగ సాయన్న జయంతి సభను అడ్డుకుంటే సహించేది లేదు

తెలంగాణ ముదిరాజ్ జెఏసిపై మండిపడ్డ ముదిరాజ్ మహాసభ

కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ముదిరాజ్

హుజురాబాద్ టౌన్, అక్టోబర్ 21 (తెలంగాణ మంజీరా) :

హైదరాబాద్ రవీంద్రభారతిలో అక్టోబర్ 22 న జరుగు పండుగ సాయన్న జయంతి సభను అడ్డుకుంటామని తెలంగాణ ముదిరాజ్ జె ఏ సి మాట్లా డడం ముదిరాజుల ఆత్మ గౌరవాన్ని అగౌరపరచడమేనని ఈ చర్యను ముదిరాజ్ మహాసభ తీవ్రంగా కండి స్తుందని ముదిరాజ్ మహాసభ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ జె ఏ సి చర్యలను కండిస్తూ ఆయన ఒక వీడియో ద్వారా మాట్లాడుతూ ఇప్పటికే కొందరు స్వార్థ రాజకీయ నాయకుల వల్ల తెలంగాణ లో ముదిరాజ్ కులం మూడు ముక్కలు అయిందని ఎవరి రాజకీయా లబ్దికోసం ముదిరాజ్ జె ఏ సి పని చేస్తుందో ముదిరాజ్ విద్యావంతులు. యువత.గమనించాలని సమ్మయ్య కోరారు.పండుగ సాయన్న అంటే తెలంగాణ రాబిన్ హుడ్ అని 1840.నుండి 1900 స,,రాల మధ్యకాలంలో ఈ తెలంగాణ నేలపై వీరోచిత పోరాట లతో అక్రమ సంపన్నుల గుండెల్లో నిద్రపోతు నిరుపేదల ఆకలితీర్చుతూ పేదింటి పెద్దన్నల చరిత్ర సృష్టించిన విరాది వీరుడు పండుగ సాయన్నను స్మరిస్తూ జరిగే సభను తెలంగాణ జె ఏ సి ముసుగులో అడ్డుకుంటామనడం సిగ్గు మాలిన చర్య అని సమ్మయ్య మండి పడ్డారు. ముదిరాజ్ ల అభివృద్ధికి బి సి. డి.నుండి బి సి. ఏ.కు రావడానికి ముదిరాజ్ జె ఏ సి.పోరాడాలి కానీ స్వార్ధ రాజకీయా నాయకుల కొమ్ము కాస్తూ మనలో మనకు కలహాలు సృష్టిస్తూ సాయన్న సభను అడ్డుకుంటామంటున్న వారి భరతం పట్టాలని అందుకు యావత్ తెలంగాణ ముదిరాజ్ విద్యావంతులు.మేధావులు .ఉద్యోగులు.కులబందువులు మేల్కొని కులం వేలుని కులం కంట్లో పొడవాలని చూస్తున్న గుంటనక్కలను గుర్తించి బుద్ధిచెప్పాలని ఈ సందర్భంగా సమ్మయ్య కోరురు..ఎవరెన్ని కుతంత్రాలు పన్నినా పండుగ సాయన్న జయంతి పండుగను తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అంగరంగ వైభవంగా ముదిరాజు లు జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు..

పోలీస్ అమరవీరులకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఘన నివాళి...

ఆసిఫాబాద్,అక్టోబర్, 21 (తెలంగాణ మంజీరా)

విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని, వారి త్యాగాలు మరువలేనివని జిల్లా ఎస్పీ నితికా పంత్ అన్నారు.బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించి, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించారు.అనంతరం సాయుధ పోలీసులు శోక్ శస్త్ర నిర్వహించి నివాళులర్పించారు. పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. గత ఏడాది నుండి ఇప్పటివరకు దేశంలో విధి నిర్వహణలో మరణించిన 154 మంది పోలీస్ అమరవీరుల పేర్లను డీఎస్పీ అశోక్ చదివి వినిపించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధతతో కూడిన పవిత్రమైన కర్తవ్యమని అన్నారు.1959 అక్టోబరు 21న లడఖ్ లోని హాట్ స్ప్రింగ్స్ ప్రాంతంలో చైనా సైనికుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన పది మంది సీఆర్పీఎఫ్ సిబ్బంది వీరమరణానికి గుర్తుగా ప్రతి ఏటా అక్టోబరు 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.దేశ రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని, వారి సేవలను సమాజం ఎప్పటికీ మరువవదని అన్నారు.జిల్లాలోని కాగజ్ నగర్, ఆసిఫాబాదు ప్రాంతాల్లో 1985 నుండి ఇప్పటివరకు 14 మంది పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలను త్యాగం చేశారని తెలిపారు. పోలీసు సిబ్బంది పండుగలు, సెలవులకు అతీతంగా విధులు నిర్వహిస్తూ, కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజల భద్రత కోసం శ్రమిస్తారని అన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వారిని శాలువాలతో సన్మానించారు.అక్టోబరు 22 నుండి పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్, వీడియోగ్రఫీ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువత, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.కార్యక్రమంలో డీఎస్పీలు బి. అశోక్, వాహిదుద్దీన్, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరామర్శించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు.

కమాన్ పూర్ (తెలంగాణ మంజీరా)అక్టోబర్ 21

కమాన్ పూర్ మండల కేంద్రంలో పలు మృతుల కుటుంబాలను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సయ్యద్ అన్వర్ పరామర్శించారు. స్థానిక మండల కేంద్రంలోని ఇస్లాంపూరకు చెందిన మహమ్మద్ అబ్బు, వలి హైదర్, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వాళ్ల కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించిన కమాన్ పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ ఎస్ అన్వర్ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వారితోపాటు సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్యాల మహేష్ గౌడ్, యూసఫ్ లల్లు,సయ్యద్ నజీబ్, మహమ్మద్ అఫ్రోజ్, ఇర్ఫాన్, అజార్, తదితరులు మృతుల కుటుంబాలకు మనోధర్యం కల్పించారు,

కాటా శ్రీనివాస్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రవీణ్ కుమార్

పటాన్‌చెరు, అక్టోబర్ 21 (తెలంగాణ మంజీరా):

పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్‌ను బొల్లారం డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో కాటా శ్రీనివాస్ గౌడ్‌ను కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగ సందర్భంగా పరస్పరం శు భాకాంక్షలు తెలుపుకుంటూ ఆత్మీయంగా ముచ్చటించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీకి కొలన్ బాల్ రెడ్డి దసరా శుభాకాంక్షలు

పటాన్‌చెరు, అక్టోబర్ 21 (తెలంగాణ మంజీరా)

దసరా పండుగను పురస్కరించుకొని జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను మర్యాదపూర్వకంగా కలిశారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు నివాసాలకు వెళ్లి వారిని కలిశారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులతో ఆత్మీయంగా ముచ్చటించి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బొల్లారం మాజీ కౌన్సిలర్లు బాచుపల్లి జైపాల్ రెడ్డి, టి. సాయికిరణ్ రెడ్డి, వి. బీరప్ప యాదవ్, వట్టిపల్లి శ్రీకాంత్ యాదవ్, మాజీ వార్డు సభ్యుడు సంతోష్ రెడ్డి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

విజయదశమి సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు శుభాకాంక్షలు

- మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ మర్యాదపూర్వక భేటీ

బోయిన్ పల్లి: అక్టోబర్ 21 (తెలంగాణ మంజీరా)

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గ శాసనసభ్యుడు మాధవరం కృష్ణారావును ఓల్డ్ బోయినపల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును శాలువాతో సత్కరించి, విజయదశమి పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు. విజయదశమి పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, విజయాలు నింపాలని ఆకాంక్షించారు. అదేవిధంగా ఓల్డ్ బోయినపల్లి ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుర్రి యాదగిరి జన్మదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆయనను శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యాదగిరి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి హరినాథ్, ఖదీర్ బాయ్, మక్కల సత్యనారాయణ, కోమటి బాలరాజ్, పోచయ్య, కృష్ణారెడ్డి, ఐలేష్, నాగేష్, షార్ఫ్, సోఫీ తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను కలిసి పండుగ శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు జన్మదిన వేడుకలో పాల్గొనడం పట్ల నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు.

ఆనందం... అభిమానం..!

-ఒకరినొకరు పలకరింపులతో అలయ్ బలయ్ -ఘనంగా దసరా పండుగ వేడుకలు
-జనసంద్రంతో నిండిపోయిన అంబేద్కర్ స్టేడియం -రాంమందిరం నుండి స్టేడియం వరకు ఊరేగింపు
-దసరా వేడుకల్లో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

విజయ దశమి (దసరా) పండుగ ఉత్సవాలు జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జిల్లా ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో తల్లిదండ్రుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత కొడుకులు, కుమార్తెలు, కోడళ్లపై ఉందన్నారు. సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ కుటుంబ బంధాలు, పెద్దల ఆరోగ్యం, ప్రజలతో తనకున్న అనుబంధం గురించి భావోద్వేగంగా మాట్లాడారు.

అంబరాన్నంటిన దసరా సంబురాలు

సంగారెడ్డిలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఏటా అంబేద్కర్ స్టేడియం వేదికగా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే దసరా వేడుకలు ఈసారి కూడా అత్యంత వైభవంగా సాగాయి. పట్టణంలోని రామమందిరంలో ప్రత్యేక భజన కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. రామమందిరం భజన మండలి సభ్యులు, భక్తులతో కలిసి జగ్గారెడ్డి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సంప్రదాయబద్ధంగా శావను తీసుకుని రామమందిరం నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఊరేగింపుగా తరలివచ్చారు. అంబేద్కర్ స్టేడియంలో దసరా ఉత్సవాల కోసం భారీ ఏర్పాట్లు చేశారు. వేదికపై మహేశ్వరశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో జగ్గారెడ్డి కుటుంబ సభ్యులు సంప్రదాయబద్ధంగా జమ్మిపూజ నిర్వహించారు.

అనంతరం నిర్వహించిన రావణ దహన కార్యక్రమం ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భారీగా తరలివచ్చిన ప్రజలు రావణ దహనాన్ని ఆసక్తిగా తిలకించారు. ఆకాశంలో వెలుగులు విరజిమ్మిన బాణసంచా మెరుపులు, ఆకట్టుకునే డ్రోన్ల ప్రదర్శన ప్రేక్షకులను కనువిందు చేశాయి. ప్రముఖ సినీ నేపథ్య గాయకులచే ఏర్పాటు చేసిన సంగీత విభావరి ఆహుతులను మంత్ర ముగ్ధులను చేసింది.

సంగారెడ్డి ప్రజలే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చారు

తన రాజకీయ ప్రస్థానాన్ని, సంగారెడ్డి ప్రజలతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. “నా దగ్గర చాలా డబ్బులు ఉన్నాయని అందరూ అనుకుంటారు. కానీ నాకు వచ్చిన డబ్బును ప్రతి ఏటా ప్రజల కోసం పండుగలు నిర్వహించడానికి ఖర్చు చేస్తున్నాను. నలభై ఏళ్ల క్రితం చిన్న వయసులో ఉన్నప్పుడు ఇదే మైదానంలో నా స్నేహితులతో కలిసి దసరా వేడుకల్లో పాల్గొన్నాను. ఆనాటి నుంచి ఈనాటి వరకు సంగారెడ్డితో నా అనుబంధం కొనసాగుతోంది. నన్ను కౌన్సిలర్ స్థాయి నుంచి ఈ స్థాయికి తీసుకొచ్చింది సంగారెడ్డి ప్రజలేనని పేర్కొన్నారు. దసరా వేదికను తాను ఎన్నడూ రాజకీయాల కోసం ఉపయోగించుకోలేదన్నారు. “ఈ వేదికపై నుంచి నేను ఎప్పుడూ రాజకీయాలు మాట్లాడలేదు. ఓట్లు అడగలేదు. కానీ నా మనసులో ఉన్న మాటలను మాత్రం ప్రజలతో పంచుకుంటానని చెప్పారు. ఈ దసరా పండుగ ఉత్సవాల్లో సంగారెడ్డి పట్టణ ప్రజలు, యువకులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు...

తొందర్లో డీపీఆర్ సిద్ధం...

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం...

అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ...

నిజామాబాద్ అక్టోబర్ 21 (తెలంగాణ మంజీరా)ప్రతినిధి:

ఎంతో ఘన చరిత్ర కలిగిన ఇందూరు ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరైనట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చత్రపతి శివాజీ గురువు సమర్థ రామదాసు నిర్మించిన చారిత్రాత్మక కట్టడం ఖిల్లా రామాలయం అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దాశరథి కృష్ణమాచార్యులు జైలు శిక్షణ అనుభవిస్తూ “తెలంగాణ నాకోటి రతనాల వీణ “ అని రాసిన గొప్ప చరిత్ర కలిగిన ఖిల్లా రామాలయానికి రోప్ వే మంజూరు కావడం సంతోషకరమన్నారు. పర్యాటక స్థలంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సుమారు రూ.35 కోట్ల నిధులతో రోప్ వే నిర్మాణం కానుందని, ఇందుకోసం డీపీఆర్ సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. గతంలో పాలించిన పాలకులు రామాలయ అభివృద్ధిని మరిచారన్నారు. మోదీ ప్రభుత్వం చారిత్రక కట్టడాలపై ప్రత్యేక దృష్టి వహిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగానే పర్వతమాల పథకానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తో కలిసి ఖిల్లా రామాలయ అభివృద్ధి కొరకు గతంలో కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీంతో రోప్ వే మంజూరైనట్లు స్పష్టం చేశారు. కేంద్రమంత్రి నితిన్ ఘట్కరితోపాటు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఖిల్లా రామాలయ అభివృద్ధి పై అనేక సార్లు లేఖలు అందజేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రోడ్లు భవనాల శాఖ అధికారులను, రోప్ వే కంపెనీ ప్రతినిధులను పంపడం సంతోషకరమన్నారు. అర్బన్ నియోజకవర్గ అభివృద్ధి తన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో నిలిచిపోయిన పనులపై కూడా అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. రాష్ట్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఒక్కటి కూడా రాని నియోజకవర్గం ఇందూరు ఒకటేనని చెప్పారు. సమస్యను మంత్రి పొంగిలేటి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. దీంతో ఇటీవల అర్బన్ లోని సౌత్ మండల అర్హులకు ఇళ్లను కేటాయించాలని గుర్తు చేశారు. అలాగే స్థలం లేని వారికి హైదరాబాద్ మాదిరిగా టవర్లు నిర్మించి ఇవ్వాలని చెప్పినట్లు తెలిపారు. ప్రధానంగా స్పెషల్ ఫండ్ కోసం ప్రభుత్వానికి అనేకసార్లు లీగల్ రాసిన స్పందించడం లేదన్నారు. చివరికి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకుండా పోయిందన్నారు. స్పెషల్ ఫండ్ కేటాయిస్తే నియోజకవర్గ అభివృద్ధి సులువుగా అవుతుందని తెలిపారు. ఇందూరులో కాషాయ జెండా గెలుపును ఓర్చుకోలేక నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. అవసరపు మాటలు మాట్లాడటమే తప్ప అభివృద్ధి కొరకు కాంగ్రెస్ ఆలోచించడం లేదన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోల్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, మఠం పవన్, రాము, విజయ మల్లేష్ యాదవ్, ప్రసూన శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి మురళి, సుమిత్ర కిషోర్, బంటు ప్రీతి ప్రవీణ్, మహిళా మోర్చ అధ్యక్షురాలు వనిత, యువ మోర్చ అధ్యక్షుడు వంశీ, యువ మోర్చ రాష్ట్ర సహ కోశాధికారి విజయ్, ఎస్సీ మోర్చ పురుషోత్తం, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.